
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

మంగళవారం 6 మే 2025



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

రాహుల్‌గాంధీ ఆలోచనతోనే

బీజేపీ కులగణన

రేపు జిల్లా కాంగ్రెస్ సమావేశం

బీసీ రిజర్వేషన్ల బిల్లు దేశానికే ఆదర్శం

డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మే 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనతోనే కేంద్ర ప్రభుత్వం కులగణన ప్రకటన చేసిందని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పరిగిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో అధికారంలోకి రాగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై సీఎం రేవంత్ రెడ్డి బిల్లు పెట్టించి కేంద్రానికి పంపించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఆలోచన, నిర్ణయం మేరకు బీజేపీ దేశవ్యాప్తంగా కులగణన చేపడుతామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. మైనార్టీలలో వెనుకబడిన వర్గాలను బీసీలుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.


రేపు జిల్లా కాంగ్రెస్ సమావేశం

కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు 7వ తేదీన వికారాబాద్‌లోని సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో జిల్లా పార్టీ సమావేశాన్ని నిర్వహిస్తున్నటు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో పార్టీ బలోపేతం, సంస్థాగత ఎన్నికలపై ప్రధానంగా చర్చ జరుగుతుందన్నారు. అలాగే గ్రామ, మండల, జిల్లా స్థాయి కొత్త కమిటీలను ఎన్నుకుంటారని తెలిపారు. ఈ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, పీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, పరిశీలకులు నరేందర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. 2017 కంటే ముందు నుంచి పార్టీలో పని చేసేవారికే పదవుల్లో ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఈ జిల్లా సమావేశానికి పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో పరిగి ఏఎంసీ చైర్మన్ పరుశరాంరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సిద్దాంతి పార్థసారథి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, సత్యనారాయణ, విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ పట్టణానికి చెందిన నారాయణ అనే వ్యక్తి ఇటీవల ఓ మాంసం దుకాణంలో కిలో మటన్ కొనుగోలు చేశాడు. ఆ మాంసం బరువుపై అనుమానం వచ్చి దాన్ని ఎలక్ట్రానిక్ కాంటాలో తూకం వేయించాడు. అప్పుడది 800 గ్రాములు చూపించడంతో నివ్వెరపోయాడు.

ఓ స్టీల్ దుకాణంలో కొండయ్య అనే మేస్త్రీ 80 కిలోల స్టీల్ ఖరీదు చేశాడు. దుకాణం వద్ద ఎలక్ట్రానిక్ కాంటా 80 కిలోలు చూపించింది. అయినా అనుమానంతో మరో చోట కాంటా వేయించగా దాదాపు 10 కిలోలు తూకంలో తేడా వచ్చింది.

కుమార్ అనే యువకుడు మేడ్చల్ జిల్లా కేంద్రంలోని ఓ పెట్రోల్ బంకులో తన ద్విచక్రవాహనంలో రూ.100 విలువైన పెట్రోల్ పోయించుకున్నాడు. 30 కిలోమీటర్లు కూడా తిరుగక ముందే ట్యాంకు ఖాళీ అయ్యింది. దీంతో సదరు బంక్‌లో పెట్రోల్ కొలతల్లో తేడాలున్నట్లు గుర్తించాడు.



తూతూమంత్రంగా తనిఖీలు

నేడు చాలా చోట్ల సాధారణ కాంటాలకు బదులు ఎలక్ట్రానిక్ కాంటాలను వినియోగిస్తున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలు, పెట్రోల్ బంకుల్లో చిప్పులు మార్చి దోపిడీకి తెగబడుతున్నారు. గతంలో పలుమార్లు అధికారులు మేడ్చల్ జిల్లాలోని పలు పెట్రోల్ బంకులపై, స్టీలు దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఆ సమయంలో ఈ తరహా మోసాలు వెలుగులోకి వచ్చాయి. ఎలక్ట్రానిక్ యంత్రాల్లో ప్రత్యేకంగా చిప్‌లు అమర్చి యథేచ్ఛగా మోసానికి పాల్పడుతున్నప్పటికీ అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఎప్పుడో ఓ సారి తూతూమంత్రంగా తనిఖీలు జరిపి చర్యలు తీసుకోకపోవడంతో పలువురు దుకాణాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జిల్లా వ్యాప్తంగా దాడులు జరిపి తగిన చర్యలు చేపట్టాలని మేడ్చల్ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

కొనుగోల్‌మాల్!

కిలోకు 150 నుంచి 200గ్రా. తరుగు

ఎలక్ట్రానిక్ కాంటాలతో మరింత మోసం

నిండా మునుగుతున్న వినియోగదారులు

పెట్రోల్ బంకుల్లో కొలతలపై అనుమానాలే!

సినిమా హాళ్లల్లో చిరుతిళ్లపై అడ్డగోలు మోసం

తూనికల, కొలతల అధికారుల తనిఖీలు కరువు

కూరగాయలు.. మాంసం.. చేపలు.. స్టీల్.. బంకుల్లో పెట్రోలు.. ఇలా ఏ వస్తువు మార్కెట్‌లో కొనుగోలు చేసినా తూకంలో భారీగా మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. సాధారణ త్రాసుల్లో కాలం చెల్లిన బాట్లు, రాళ్లు వినియోగిస్తూ కొనుగోలుదారులను నిలువుదోపిడీ చేస్తున్నారు. అలాగే కంప్యూటర్ కాంటాల్లోనూ చిప్పులు మార్చి దోచేస్తున్నారు. ఒక కేజీ వస్తువు కొనుగోలు చేస్తే అది కేవలం 700 నుంచి 800 గ్రాములు ఉంటుండడం ఇందుకు నిదర్శనం. పెట్రోల్ బంకుల్లోనూ ఇదే తంతు. ఇంత జరుగుతున్నా.. తూనికలు, కొలతలను పర్యవేక్షించాల్సిన ఆ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

తూకాల్లో భారీ దోపిడీ



మేడల్ ప్రతినిధి, మే 5(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తూనికలు, కొలతల అధికారులు పట్టించుకోకపోవడంతో వినియోగదారులు మోసాలకు గురవుతున్నారు. ఎక్కడ ఏ వస్తువు కొనుగోలు చేసినా వాటి తూకంలో భారీగా తేడాలుంటున్నాయి. సాధారణ త్రాసులతో చాలా మంది దుకాణాదారులు కొనుగోలుదారులను దోచుకుంటున్నారు. కొనుగోలు చేసే సమయంలో త్రాసులో ఓ వైపు ఉన్న తూనిక బాట్లు, మరో వైపున కూరగాయలు, లేదంటే ఇతర సరుకుల వైపు తప్పనిసరిగా పరిశీలిస్తాం. అయినా బరువులో వ్యత్యాసం ఉంటోంది. అయితే రైతుబజారు, ఇతర మార్కెట్లు, మాంసాహార దుకాణాలు, కూరగాయల వ్యాపారులు,

మిగతా 8వ పేజీలో...

దరఖాస్తుల ఆహ్వానం



కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక రంగాల పనితీరు మెరుగుపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం.. జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను మంజూరు చేసింది. వీటి కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. ఈ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి మే 10 చివరి తేదీగా నిర్ణయించామని అభ్యర్థులు ఇతర వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌ఐఎంఎస్‌ఎంఈ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్ సంప్రదించాలన్నారు. వివరణ కోసం 8688921546ను సంప్రదించాలని ఒక ప్రకటనలో తెలిపారు.



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా
రుద్రాభిషేకం

కీసర, మే5(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలోని భవానీ శివదుర్గ సమేత రామలింగేశ్వర స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. వేసవి సెలవులు కావడంతో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా నిత్య సేవల్లో భాగంగా ఆలయ ఆవరణలో పల్లకీ సేవ నిర్వహించారు.

ఘొల్లుమంటున్న
గొల్లచెరువు!

ఆక్రమణలతో కుచించుకుపోతున్న విస్తీర్ణం



15 నుంచి 20 ఎకరాలు కబ్జా

మురుగుతో కలుషితమవుతున్న నీరు

ఇష్టారీతిన చేపడుతున్న అక్రమ నిర్మాణాలు

ఆందోళనలో తాండూరు పట్టణ ప్రజలు

చెరువును కాపాడండి అంటూ ఆందోళనలు

తాండూరు, మే 5(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని గొల్ల చెరువు అక్రమార్కుల చెరలో చిక్కుకుంది. కబ్జాల పర్వంతో రోజురోజుకు చెరువు విస్తీర్ణం కుచించుకుపోతోంది. చెరువు శిఖాన్ని ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలను చేపడుతున్నారు. మరోవైపు తాండూరు పట్టణంలోని పలు కాలనీల మురుగు చెరువులోకి వచ్చి చేరుతుండడంతో నీరంతా కలుషితమవుతోంది. 'గొల్ల చెరువును కాపాడండి' అంటూ తాండూరు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, తాండూరు సిటిజన్ వెల్ఫేర్ సొసైటీలు ముమ్మరంగా పోరాటం చేస్తున్నాయి. ఈ విషయమై త్వరలోనే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని తాండూరు సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ నిర్ణయించింది.

ఇష్టారీతిన అక్రమ నిర్మాణాలు

ఈ చెరువు అసలు విస్తీర్ణం 81 ఎకరాల 3 గుంటలు. ఈ విస్తీర్ణంలో ఇప్పటివరకు దాదాపు 15 నుంచి 20 ఎకరాలు ఆక్రమణకు

మిగతా 8వ పేజీలో...

న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం



గొల్ల చెరువు ఆక్రమణకు గురి కావడం, చెరువులోకి మురుగు నీరు రావడంపై న్యాయ స్థానాన్ని ఆశ్రయించాలని సొసైటీ తీర్మానించింది. త్వరలోనే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)ని ఆశ్రయిస్తాం. అడ్డూ అదుపు లేకుండా అక్రమణలు జరుగుతున్నాయి. పట్టణలోని మురుగు నీరంతా చెరువులోకి వదలుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

- రాజ్‌గోపాల్ సార్డా, తాండూరు సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ

ఇప్పటికే కబ్జాలను గుర్తించాం



గొల్ల చెరువు రికార్డుల ప్రకారం 81 ఎకరాలు ఉంది. సర్వే చేపట్టగా 11 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించాం. ప్రభుత్వానికి నివేదిక పంపించాం. పట్టణంలో డ్రెయిన్ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం నుంచి నిర్ణయం వచ్చాక చర్యలు తీసుకుంటాం.

- సాయికుమార్, ఇరిగేషన్ శాఖ ఏఈ, తాండూరు

బీజేపీది రాజ్యాంగాన్ని
మార్చే కుట్ర



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సునీత ముదిరాజ్

వికారాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నం చేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీత ముదిరాజ్ ఆరోపించారు. సోమవారం కాంగ్రెస్ 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమం పిలుపు మేరకు జిల్లా మహిళా అధ్యక్షురాలు సంతోషరాజు ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్రం నిత్యావసర ధరలు పెంచి ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. గ్యాస్ ధరలు పెంచి పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మార్చిందన్నారు. అస్సాం ముఖ్యమంత్రి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మహిళా మండల కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సీఎం జిల్లాలో కమిటీలు వేయక పోవడం సరికాదన్నారు. అవసరమైతే రాష్ట్ర ఇన్‌చార్జి దృష్టికి ఇక్కడి సమస్యను తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సంతోష రాజు, జిల్లా కార్యదర్శి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

బందోబస్తు మధ్య
భూసర్వే

» హకీంపేట్, లగచర్ల గ్రామాల్లో సర్వే


దుద్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి):ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటులో భాగంగా సోమవారం హకీంపేట్, లగచర్ల గ్రామాల్లో తహసీల్దార్ కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు మధ్య రెవెన్యూ సిబ్బందితో 9 సర్వే నంబర్‌లోని 85 ఎకరాల్లో భూ సర్వే నిర్వహించారు. దుద్యాల మండలంలోని పోలెపల్లి, హకీంపేట్, లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాల పరిధిలో ప్రభుత్వం ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుకు ఇదివరకే భూ సేకరణ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సర్వేలో రైతులు చూపించిన హద్దుల ను నమోదు చేసుకొని సంతకాలు తీసుకున్నారు. అయితే ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుకు భూములు ఇచ్చేందుకు అంగీకరించిన రైతుల భూముల్లో సర్వే చేపట్టి పరిహారాన్ని సైతం అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు, ఆర్ఐ నవీన్, సర్వేయర్లు మహేశ్, ప్రవీణ్, మహేశ్, పకీరప్ప, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా..

భూ అభిప్రాయ సేకరణలో గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సైలు యాదగిరి, అబ్దుల్ రవూఫ్, సత్యనారాయణ, రవిగౌడ్, వెంకట్ కృష్ణ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు మధయ భూ సర్వే నిర్వహించారు. ఎస్పీ నారాయణరెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు. అంతకు ముందు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీసులకు సూచించారు.

రెవెన్యూ సదస్సులో 27 దరఖాస్తులు

» పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ధారూరు, మే5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాచారం, అవుసుపల్లి గ్రామాలలో సోమవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులను కలెక్టర్ ప్రతీక్ జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఆయా గ్రామాల రైతుల నుంచి వచ్చిన దరఖాస్తుల గురించి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి భూ సమస్యల తీరును తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ సాజిదా బేగం ఉన్నారు. ఈ సదస్సులలో మొత్తం 27 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సాజిదాబేగం తెలిపారు. బాచారంలో 16, అవుసుపల్లిలో 11 దరఖాస్తులు చొప్పున అందయన్నారు.

భూ సమస్యలు సత్వరమే పరిష్కారం

మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్



ధర్మారంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

కీసర, మే5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, కొత్త చట్టంతో సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయని కలెక్టర్ గౌతమ్ అన్నారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా సోమవారం కీసర పరిధిలోని నర్సంపల్లి, ధర్మారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ధర్మారంలో జరిగిన సదస్సును కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. భూ సమస్యలపై అర్జీలు సమర్పించే వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. దరఖాస్తులను వెంటనే పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు రైతులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మొదటి రోజు నిర్వహించిన సదస్సులో మొత్తం 80 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అందుల్లో 13 దరఖాస్తూలు తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కారం చేయవచ్చని అధికారులు తెలిపారు. దరఖాస్తులను మరోసారి పరిశీలించి, నోటీసులు జారీ చేస్తామన్నారు. చట్టానికి లోబడి సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అశోక్ తెలిపారు. కార్యక్రమంలో న్యాయశాస్త్ర అధికారిణి చంద్రావతి, ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, లతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



తాటి ముంజలు..
భలే మజా

నగర శివారులో రోడ్ల పక్కన విరివిగా విక్రయాలు

వేసవిలో ముంజలకు భారీ గిరాకీ!

7

కాంగ్రెస్ నాయకుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం


రమణారెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, మే 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు చింతల రమణారెడ్డి ఆకస్మికంగా మృతిచెందారు. సోమవారం ఆయన మృతదేహాన్ని హైదరాబాద్‌లోని నివాసంలో కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, మాజీ ఎంపీ పోతుగంటి రాములు సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, పంచాయతీ రాజ్ చాంబర్ కార్యదర్శి యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

తాండూరు డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు


తాండూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

తాండూరు, మే 5(ఆంధ్రజ్యోతి): విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది నుంచి కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ ఎస్. లక్ష్మన్ వెల్లడించారు. ఇందుకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అనుమతి లభించిందని ఆయన పేర్కొన్నారు. బీఎస్సీ(ఫిజికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్) బీఎస్సీ(లైఫ్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్), బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ(కంప్యూటర్ అప్లికేషన్స్) బీఏ(మాస్ కమ్యూనికేషన్, జర్నలిజం), (సోషియాలజీ, ఆంత్రొపాలజీ, సైకాలజీ, జాగ్రఫీ, పబ్లిక్ అప్లికేషన్) కోర్సులను కొత్తగా ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తామని చెప్పారు.

డిజిటల్ ల్యాబ్ సౌకర్యం

హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్టివిటీ కలిగిన నాలుగు డిజిటల్ తరగతులు, ఆధునాతన నూతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వర్చ్యువల్ తరగతులు, ఆన్‌లైన్ వెబినార్, సెమినార్ సదస్సులు, పరీక్షలు, తరగతులకు ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ చెప్పారు.

మూడు విడతల్లో అడ్మిషన్లు

రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 చెల్లించాలి. ఈ నెల 21 వరకు దరఖాస్తుల స్వీకరిస్తారు.పదోతేదీ నుంచి 21 వరకు వెబ్ ఆప్షన్లు ఉంటాయి. 29న తొలి లిస్ట్ విడుదల చేస్తారు. జూన్ 24 నుంచి 28లోపు విద్యార్థులు కాలేజీలో రిపోర్ట్ చేయాలి. జూన్ 30 నుంచి ఫస్ట్‌సెమిస్టర్ తరగతులు ప్రారంభిస్తారు.

ఘనంగా కామరాతి బీరప్పస్వామి కల్యాణోత్సవం


కల్యాణ మహోత్సవంలో మాజీ జెడ్పీటీసీ శ్రీలత-సత్యనారాయణ దంపతులు, గ్రామస్తులు

కొత్తూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్‌బీపల్లి ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. బీరప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు, షెపర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్మె సత్యనారాయణ ఆధ్వర్యంలో వారంలో రోజలుగా కామరాతి బీరప్ప ఆలయ ప్రారంభ మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. సోమవారం కామరాతి బీరప్ప కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారు జామునుంచే పూజాకార్యక్రమాలతో మహోత్సవం ప్రారంభమైంది. మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ దంపతులు, పలువురు గ్రామస్తులు పాల్గొని కల్యాణాన్ని జరిపించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ క్యామ మల్లేష్, జెడ్పీ మాజీచైర్మన్ అనితారెడ్డి, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎగ్గె మల్లేష్ మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రజలు గృహాలను సర్వంగా సుందరంగా తీర్చిదిద్దుకుని కుటుంబ సభ్యులు, బంధువులతో తరలి వచ్చి కల్యాణంలో పాల్గొని విందు చేసుకున్నారు. కల్యాణ మహోత్సవానికి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చి కామరాతిబీరప్ప కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు అంబటి ప్రభాకర్, ఎమ్మె వెంకటయ్య, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, వంకాయల నారాయణరెడ్డి, ఈట గణేష్, శ్రీనివాస్‌గౌడ్, బి.దేవేందర్‌యాదవ్, ఎమ్మె సత్తయ్య. అందె మెహన్, జంగ నర్సింహ, కృష్ణ, శ్రీశైలం, ఆంజనేయులు, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఐలయ్య

బార్ కౌన్సిల్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి.. షోకాజ్ నోటీసులు

ఇబ్రహీంపట్నం, మే 5(ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా కార్యవర్గాన్ని ప్రకటించుకున్న న్యాయవాదులకు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముద్దం వెంకటేశం, అరిగె శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఇబ్రహీంపట్నం అదనపు జిల్లా న్యాయస్థానాల సముదాయంలో బార్‌అసోసియేషన్ 1989లో రిజిస్టరై తెలంగాణ బార్ కౌన్సిల్ గుర్తింపు పొందిందని, అప్పటి నుంచి న్యాయవాదుల అసోసియేషన్‌కు ప్రతీ సంవత్సరం ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత నెల 15న సైతం ఎన్నికలను నిర్వహించగా న్యాయవాదులు ఎన్నికలో పాల్గొని బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని చెప్పారు. కాగా ఎన్నికల్లో ఓడిన కొంతమంది న్యాయవాదులు నిబంధనలకు విరుద్ధంగా ఈ నెల 2న అనధికారికంగా సొంతంగా కార్యవర్గాన్ని ప్రకటించుకొని సోషల్ మీడియాల్లో, వార్తా పత్రికల్లో ప్రచురణ చేయించారని తెలిపారు. ఇది బార్ కౌన్సిల్, బార్ అసోసియేషన్ నిబంధనలకు వ్యతిరేకమన్నారు. ఇందుకు బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ బార్ కౌన్సిల్ సిఫారసు మేరకు బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని వారు వివరించారు.

ప్రజావాణికి వచ్చే సమస్యలను సత్వరం పరిష్కరించాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్వో హరిప్రియ, తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, మే 5(ఆంధ్రజ్యోతి):ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్వో, తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డిలు ప్రజల ఫిర్యాదులను స్వీకరించారు. డీఆర్వో మాట్లాడుతూ.. వివిధ శాఖల్లోని ప్రజాసమస్యలపై నిర్వహిస్తున్న ప్రజావాణ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే వినతులపై అధికారులు వెంటనే పరిశీ లించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినతుల పై చేపట్టిన చర్యలను తెలియజేసేలా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో స్టేటస్‌ను అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దని అధికారులకు సూచించారు. ఈ ప్రజావాణిలో 91ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ భూమి కేటాయించాలి


ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న ఓరుగంటి యాదయ్య

రంగారెడ్డి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని భవన నిర్మాణ కార్మికుల కోసం సర్వే నంబర్ 323లోని ప్రభుత్వ భూమిని కేటాయించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీవోసీ అధ్యక్షుడు జనార్ధన్, సుందరమ్మ, నాగేశ్వర్, ఎన్.లక్ష్మి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతానవమి ఉత్సవం


నాగలి దున్నుతున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం సీతానవమి ఉత్సవాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో సీతామాత చిత్రపటానికి పూజచేసి ఉత్సవాన్ని కొనసాగించారు. నాగటి సాలులో సీతామాత ఉద్భవించినందున కాడెడ్ల నాగలి కట్టి నర్సింహులు భూమి దున్ని ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణను తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంతానం కోసం జనక మహారాజు యాగం చేసి, నాగలిపట్టి దున్నుతుంటే నాగటి సాలులో సీతామాత ఉద్భవించిందని తెలిపారు. నవమి రోజు శ్రీరామచంద్రుడు జన్మిస్తే నెల రోజుల తరువాత నవమి రోజే సీతామాత ఉద్భవించిందని తెలిపారు. శ్రీరామచంద్రుడి మాటను జవదాటకుండా తర తరాలకు ఆదర్శమూర్తిగా నిలిచిందని తెలిపారు. కొన్ని గంటల్లోనే పట్టాభిషేకం కాబోతున్న సమయంలోనే భర్తతోపాటు ఆభరణాలు త్యజించి, నార వస్త్రాలతో అరణ్యవాసం చేసిన పుణ్యమూర్తి సీతాదేవి అని అన్నారు. భార్యగా, తల్లిగా, వదినగా తరతరాలకు గొప్ప సందేశమిచ్చిన సీతామాత జయంతి ఉత్సవాన్ని ప్రతీ సంవత్సరం ఘనంగా నిర్వహిస్తామని నర్సింహులు ప్రకటించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పలబట్ల బాల్‌రాజ్‌గుప్తా, ఒగ్గు కిషోర్, కక్కునూరి సంఘమేశ్వర్, కానుగు రాంభూపాల్, ఇప్పలపల్లి లక్ష్మి, యాదయ్య పాల్గొన్నారు.

గట్టిప్పలపల్లి మండలం కోసం కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సాధనకు గట్టిప్పలపల్లి వాసులు చేస్తున్న రిలే నిరశన దీక్షలు సోమవారం నాటికి 190వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు మాట్లాడుతూ 11 పంచాయతీలతో గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా చేయాలని కోరారు.


భోజన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ

మార్కెట్‌లో రైతులకు ఉచిత భోజనం

ఆమనగల్లు, మే5(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ ఉదారతను చాటుకున్నారు. మార్కెట్ యార్డ్‌లో రైతులకు సొంత డబ్బుతో ఉచిత భోజన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాల నుంచి ధాన్యాన్ని తెస్తున్నారు. వారికోసం మధ్యాహ్నం సమయంలో భోజన వసతి కల్పించాలని సోమవారం మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లతో కలిసి భోజన కేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి ముగిసే వరకు ఉచిత భోజనాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు మిట్టపల్లి అంజయ్య, వస్పుల శ్రీశైలం, సంపత్, పాండురంగయ్య, నరేశ్‌నాయక్, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ కేశవులు, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎగిశెట్టి సత్యం, కాలె మల్లయ్య, శ్రీను, బీచ్యానాయక్, వెంకటేశ్, అలీం, నాజర్ పాల్గొన్నారు.

క్యాంటీన్ ఏర్పాటుకు తీర్మానం

ఆమనగల్లు, మే 5(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో క్యాంటీన్, జిరాక్స్ సెంటర్ ఏర్పాటుకు బార్ అసోసియేషన్ సభ్యులు తీర్మానించారు. సోమవారం అసోసియేషన్ సమావేశమై కోర్టుకు వచ్చే వారి సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. క్యాంటీన్, జిరాక్స్ సెంటర్ ఏర్పాటుకు ఆసక్తి గల వారి నుంచి టెండర్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీకల్లా రూ.2వేల టెండర్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం


ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న యువకులు

యాచారం, మే 5(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని నగరానికి దీటుగా అభివృద్ధి చేస్తామని, ఇందులో అనుమానాలకు తావులేదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చెప్పారు. సోమవారం మంతన్‌గౌరెల్లికి చెందిన 100మంది వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను తీరిస్తే జనం మనల్ని ఎల్లకాలంగుర్తుంచుకొని మనకే అధికారం అప్పగిస్తారన్నారు. నాయకులు గ్రామీణుల సాధకబాధకాలను తీర్చాలని కోరారు. ఆదివారం రాత్రి చౌదర్‌పల్లిలో శ్రీసీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అరవింద్‌నాయక్, ఎల్లయ్య, యాట శ్రీను, అఖిల్, సత్యనందు, రమేశ్ ఉన్నారు.

మంత్రికి ఎమ్మెల్యే ఘన స్వాగతం

కొత్తూర్, మే 5(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలం కన్హా శాంతివనంలో సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తిమ్మాపూర్ వద్ద ఘన స్వాగతం పలికారు. మంత్రి తిమ్మాపూర్‌నకు చేరుకోగానే ఎమ్మెల్యే శంకర్ బొకే అందజేసి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.


రైతుకు ఆర్డర్ కాపీని అందిస్తున్న ఆర్డీవో చంద్రకళ

భూ భారతితో సమస్యల పరిష్కారం

చేవెళ్ల, మే 5(ఆంధ్రజ్యోతి): నూతన భూ భారతి చట్టంతో ఏళ్లనాటి భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడారు. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లికి చెందిన మొహన్‌రెడ్డికి సర్వే నంబర్లు 397, 399లలో ఎకరం 12గుంటల భూమి ఉంది. ఆ భూమి కోసం మోహన్‌రెడ్డి భార్య కోర్టులో కేసు వేయగా తీర్పు మోహన్‌రెడ్డికి అనుకూలంగా వచ్చింది. కోర్టు తీర్పు ఆధారంగా మోహన్‌రెడ్డి పట్టా పాస్ బుక్ కోసం తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆర్డీవో భూ భారతి పోర్టల్ ద్వారా మోహన్‌రెడ్డి సమస్యను పరిష్కరించి అతడికి సోమవారం ఆర్డర్ కాపీని అందజేశారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

గురూజీ మఠం శేఖరయ్య మృతి

కేశంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): లేమామిడికి చెందిన ఆధ్యాత్మిక గురూజీ, మఠం శేఖరయ్య ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ సోమవారం ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. షాద్‌నగర్ ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, ప్యాక్స్ వైస్‌చైర్మన్ అంజిరెడ్డి, జమాల్‌ఖాన్, తలసాని వెంకట్‌రెడ్డి, అనుమగళ్ల రమేష్, శ్రీశైలంగౌడ్‌లు నివాళ్లు అర్పించారు. ఆమనగల్లు, మహేశ్వరం, షాద్‌నగర్, జడ్చర్ల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి నివాళి అర్పించారు. కర్ణాటక నుంచి వచ్చిన మఠం స్వాములు శివైక్య కార్యక్రమాలు నిర్వహించారు.


రాజారత్నంకు సమ్మె నోటీసు అందిస్తున్న పంచాయతీ కార్మికులు

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు

కేశంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, ట్రేడ్ యూనియన్ల పిలుపుమేరకు ఈ నెల 20 నుంచి పంచాయతీ కార్మికులు సమ్మెలో పాల్గొననున్నారు. సోమవారం కేశంపేట మండల పంచాయతీ కార్మికులు ప్రత్యేకాధికారి రాజారత్నం, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డిలకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు రామచంద్రయ్య, రవి, పారేష, పద్మ, అంజయ్య, మల్లయ్య, రోశయ్య పాల్గొన్నారు.

- » రోడ్ల పక్కన విరివిగా విక్రయాలు
- » ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్ శివారుకు లారీల్లో తరలిస్తున్న వ్యాపారులు
- » వేసవిలో ముంజలకు భారీ గిరాకీ!

తాటి ముంజలు

భలే మజా


ఎన్ఎఫ్‌సీనగర్ వద్ద తాటి ముంజల అమ్మకాలు

ఘట్‌కేసర్, మే 5(ఆంధ్రజ్యోతి): ఎండకాలంలో చాలా మంది తినేందుకు ఇష్టపడే తాటి ముంజలను నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో జోరుగా విక్రయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్, నగర శివారు ప్రాంతాలకు భారీ మొత్తంలో తాటికాయలను తెచ్చి ముంజలను వొలిచి విక్రయిస్తున్నారు. శరీరానికి చల్లదనాన్నిచ్చే తాటి ముంజలకు భారీ గిరాకీ ఉంటోంది. చిన్నాపెద్ద ఇష్టంగా తినే తాటిముంజలు అన్నిచోట్లా రోడ్ల పక్కన విరివిగా లభిస్తున్నాయి. వందలాది మంది చిరు వ్యాపారులు ఉమ్మడి నల్గొండ జిల్లా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి తాటి ముంజలు తెచ్చి విక్రయిస్తున్నారు. ఉదయమే తాటిచెట్ల వద్దకు వెళ్లి గీత కార్మికులతో తాటి కాయలను కోయించి తెచ్చి వాటి నుంచి ముంజలు ఒలిపించి ప్లాస్టిక్ ట్రేలు, బుట్టల్లో నగరానికి తెస్తున్నారు. మరో కొందరు ఏకంగా తాటి కాయలే తెచ్చి అమ్మేచోటనే వొలిచి విక్రయిస్తున్నారు. ఉదయం 11గంటలకల్లా చౌరస్తాల్లో అమ్ముకుంటున్నారు. వేసవిలో అటు గౌడన్నలకు, ఇటు చిరు వ్యాపారులకు 45 రోజుల పాటు ఉపాధి లభిస్తోంది.


ముంజలను వొలుస్తున్న అమ్మకందారులు

ఉపశమనం, ఆరోగ్యం

హైదరాబాద్, నగరశివారుల్లో తాటి ముంజలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఎండ వేడి నుంచి ఉపశమనం కల్గించడంతో పాటు ఆరోగ్యానికి మేలుచేసే తాటి ముంజలు తినేందుకు అందరూ ఆసక్తి చూపుతారు. ఆంధ్రప్రదేశ్‌లో తాటి చెట్లు ఎక్కువగా ఉండే గుంటూరు జిల్లా రేపల్లె, పిడుగురాళ్ల తదితర ప్రాంతాల నుంచి లారీల్లో తాటికాయలు తెచ్చి రోడ్ల పక్కన డంప్ చేసి విక్రయిస్తున్నారు. కొనుగోలుదారుల ముందే తాటికాయలను ఒలిచిస్తుండటంతో ఎక్కువ మంది తాటికాయల కుప్పల వద్ద కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఘట్‌కేసర్, సమీప ప్రాంతాలు, టౌన్‌షిప్‌ల వద్ద, కాలనీల్లో తాటి ముంజల విక్రయాలు భారీగా సాగుతున్నాయి.

ధర మాత్రం అంతే

గుంటూరు జిల్లా నుంచి పెద్దఎత్తున తాటికాయలను తెచ్చి వాటి నుంచి ముంజలను తీసి అమ్ముతున్నా ధరలో మాత్రం తేడా లేదని కొనుగోలు దారులవాపోతున్నారు. స్థానికంగా వంద రూపాయలకు డజను చొప్పున విక్రయిస్తున్నారు. గుంటూరు జిల్లా నుంచి లారీల లోడ్లతో తాటికాయలు తెస్తున్నా ధర మాత్రం తగ్గడం లేదని కొనుగోలుదారులు అంటున్నారు. అయితే రవాణాచార్జీలు ఎక్కువ అవుతున్నాయి కాబట్టి స్థానికంగా లభించే ముంజల కంటే తక్కువ రేటుకు రావని అమ్మకందారులు చెబుతున్నారు. అలాగే తాము తక్కువ ధరకు అమ్మితే స్థానిక వ్యాపారుల నుంచి సైతం ఆక్షేపణ వస్తుందని, అందరితోపాటే తామూ అమ్మాల్సి ఉంటుందన్నారు.

తాటి ముంజలు మేలు చేస్తాయి



ఎండాకాలంలో లభించే తాటి ముంజలను నేను తప్పక తింటాను. ఎండవేడిలో శరీరానికి చల్లదనాన్ని చేకూరుస్తాయి. చిన్నప్పటి నుంచి తాటి ముంజలను ఇష్టంగా తింటున్నా. వాటిల్లో ఎలాంటి కల్తీ చేయడానికి అవకాశమే. ఇప్పుడు లభిస్తున్న కల్తీలేని పదార్థాల్లో తాటి ముంజలను చెప్పుకోవచ్చు.

- మేడబోయిన వెంకటేశ్, ఎన్ఎఫ్‌సీనగర్

ఇష్టంగా తింటా



కేవలం ఎండాకాలంలోనే లభించే తాటి ముంజలంటే నాకు ఎంతో ఇష్టం. ఎండవేడితో ఇబ్బంది పడేవారికి చల్లదనాన్నిస్తాయి. ఆరోగ్యానికి కూడా మేలుచేస్తాయి కనుక వీటిని తినాలని వైద్యులు సైతం సూచిస్తున్నారు. సహజసిద్ధంగా దొరుకుతున్న తాంటి ముంజలను అందరూ తినాలి.

- సీహెచ్.హరికాంత్‌రెడ్డి, చందుపట్లగూడ

లయన్స్ క్లబ్ పీఆర్వోగా పాషా



ఆమనగల్లు, మే 5(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు లయన్స్ క్లబ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా ఎమ్.ఏ.పాషా 16వ సారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తూ క్లబ్ సేవలను విస్తరిస్తున్నందుకు గాను మరోసారి పాషాకు మరో అవకాశం కల్పించారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ప్రతి ఏడాది నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటుంది. 2009 నుంచి పీఆర్ఓగా పాషా ఎన్నికవుతున్నారు. పాషా లయన్స్‌క్లబ్ నుంచి రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో అనేక సేవా పురస్కారాలు అందుకున్నారు. పీఆర్ఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న నేపథ్యంలో పాషాను పలువురు అభినందించారు. తన ఎన్నికకు సహకరించిన లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్లు చెన్నకిషన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేశ్‌బాబు, రాంరెడ్డి లయన్స్ క్లబ్ ఆసుపత్రి చైర్మన్ దామోదర్‌రెడ్డి, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ వీరబొమ్మ భిక్షపతి, సభ్యులకు పాషా కృతజ్ఞతలు తెలిపారు.

పార్కు స్థలాన్ని కాపాడాలి

ఘట్‌కేసర్, మే 5(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడ, సాయిగణేష్ కాలనీ పార్కు స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని కాలనీవాసులు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ప్లాట్ నంబర్ 43, 44ల మధ్యలో నిబంధనల మేరకు వదిలిన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలోనూ అక్రమ నిర్మాణం చేస్తుంటే అప్పటి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా నిర్మాణాలను కూల్చివేశారని గుర్తుచేశారు. మరోసారి చేస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించి బోర్డు పాతాలని కాలనీవాసులు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కాలనీవాసులు సత్యం, నరేష్, బాల్‌రెడ్డి, ప్రవీన్‌కుమార్, భరత్‌కుమార్, నరేష్‌కుమార్,సత్యనారాయణ, ఈశ్వరచారి ఉన్నారు.

కాశీంపూర్‌లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం


కాశీంపూర్ కొనుగోలు కేంద్రంలో తూకం వేస్తున్న నిర్వాహకులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్: 'ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడో?' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. వారం రోజుల కిందట కేంద్రం ప్రారంభించిన కొనుగోళ్లు జరుగకపోవడంపై ఆరా తీశారు. హమాలీల కొరతతో సకాలంలో ధాన్యం సేకరణ చేయలేకపోయమని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ధాన్యం సేకరణకు చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ధాన్యం తూకాలు చేపట్టారు.

బషీరాబాద్: నవాంద్గీ సొసైటీ భవనం వద్ద సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈవో వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు వడ్డె హన్మంతు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం


వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, నర్సింలు, మధుకర్‌రెడ్డి

శామీర్‌పేట: రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేటలోని రైతు సహకార సంఘం, అలియాబాద్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా గిట్టు బాటు ధరలను పొందడానికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా, రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించడం కోసమే ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట సొసైటీ వైస్ చైర్మన్ మ్యాకల ఐలయ్య, రైతు సహకార సంఘం డైరెక్టర్లు, మాజీ జడ్పీటీసీ అనితలాలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం ...


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొడదామని, మహాత్మా గాంధీ, అంబేడ్కర్‌లను స్మరించుకుందామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కోనాయపల్లి, సంతాపూర్ గ్రామాల్లో సోమవారం జై-సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. రాజ్యాంగంద్వారానే ప్రజలకు హక్కులొచ్చాయన్నారు. రాజ్యాంగం లేక ముందు భూస్వాములు, చదువుకున్న వారికే ఓటు హక్కు ఉండేదని, ఇది గమనించిన అంబేడ్కర్ ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించారని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో జై భీమ్ అంటే మంత్రి అమిత్‌షా ఎద్దేవా చేశారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15నెలల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన, బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. పేదలకు విద్యుత్ బిల్లుల మాఫీ, ఉచిత బస్సు సౌకర్యం, రేషన్ కార్డులు ఇస్తున్నాట్లు తెలిపారు. రాహుల్ గాంధీ సూచనలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన సాగిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేష్, నాయకులు వై.యాదయ్య, బాబర్‌ఖాన్, భాస్కర్‌గౌడ్, కరుణాకర్ రెడ్డి, రమేష్, రాణి, జగదీశర్వ, శ్రీధర్‌రెడ్డి, ఇబ్రహీం, రూప్లానాయక్, గిరిధర్, పెంటయ్య, సుందరయ్య, నరసింహులు, సమీర్, నరసింహారెడ్డి, సురేష్, రాములు, రాజేందర్‌రెడ్డి, రాంరెడ్డి, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.


బెల్లయ్యనాయక్, రాజశేఖర్‌రెడ్డిలను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

ఆమనగల్లు, మే 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పాలనతోనే సామాజిక న్యాయం, అన్ని వర్గాలకు మేలుజరుగుతుందని రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ తేజవత్ బెల్లయ్యనాయక్, జీహెచ్ఎంసీ కార్పొరేటర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిలు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక విషప్రచారం సాగిస్తున్నారని మండిపడ్డారు. ఆమనగల్లులో సోమవారం బెల్లయ్య, రాజశేఖర్‌రెడ్డిలు పర్యటించి పార్టీ జిల్లా నాయకుడు మండ్లీ రాములు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నేతలను ఆదివాసి విభాగం రాష్ట్ర నాయకుడు కృష్ణానాయక్ ఆధ్వర్యంలో సత్కరించారు. రాష్ట్రాభివృద్ధి, అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చాలన్న సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత, చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని వారు అన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. రెండేళ్లలో ప్రతితండాకు బీటీరోడ్డు వేసేలా కార్యాచరణను అమలు చేస్తున్నామన్నారు. పార్టీకి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు తప్పక ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పర్వతాలు, శ్రీనునాయక్, వెంకట్‌రెడ్డి, రాజేందర్‌నాయక్, రమేశ్‌నాయక్, హర్యనాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు భూధార్

తాండూర్ రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): ఆధార్‌తో దేశంలోని ప్రతీ పౌరుడికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతీ రైతుకు 11 నంబర్లతో విశిష్ట సంఖ్యను కేటాయించాలని కేంద్రం నిర్ణయించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి కొమురయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపడుతోందని తెలిపారు. భూమి ఉన్న ప్రతీ రైతు భూములకు సంబంధించిన వివరాలతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ చేపడుతున్నట్లు చెప్పారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను, రైతు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేసి ఫార్మర్ ఐడీని కేటాయిస్తామని తెలిపారు. పీఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడత లబ్ధి పొందేందుకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు రైతు భరోసా, రుణమాఫీ తదితర పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీతో ఏ విధమైన సంబంధం ఉండదన్నారు. రైతు విశిష్ట సంఖ్యను పొందేందుకు భూయాజమాన్య పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ లింక్ చేయబడిన మొబైల్ నంబర్‌తో వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా మీసేవ కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.


ఎంపీ రఘునందర్‌రావుతో క్రాంతి కీన్ ఫౌండేషన్ ప్రతినిధులు

విద్యార్థుల హక్కుల రక్షణకు కృషి

కీసర రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హక్కుల రక్షణకు నిరంతర కృషిచేస్తానని కాంత్రి కీన్ ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి కల్యాణి అన్నారు. ఏపీలోని కోరుకొండ, కలిగిరి సైనిక్ స్కూళ్లలో తెలంగాణ రాష్ట్ర విద్యార్థుల కోటాను రద్దు చేస్తూ ఈ నెల 30న దేశ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం క్రాంతి కీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లితండ్రులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వులతో తెలంగాణా విద్యార్థులకు జరగనున్న నష్టాన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. విషయాన్ని అవగతం చేసుకున్న ఎంపీ వెంటనే కేంద్ర రక్షణ మంత్రి సంజయ్‌సేథ్‌తో ఫోన్‌లో సంప్రదించగా మంగళవారం సాయంత్రం కలిసేందుకు అవకాశం కల్పించారు. ఎంపీ మాట్లాడుతూ తెలంగాణాలో కనీసం రెండు సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేసేందుకు, అంతవరకు ఏపీలోని కోరుకొండ, కలిగిరి సైనిక్ స్కూళ్లలో యథావిధిగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంతి కీన్ ఫౌండేషన్ ప్రతినిధులు లావణ్య, జాకబ్, విద్యార్థుల తల్లితండ్రులు ఉన్నారు.

నేల స్వభావాన్ని బట్టి పంట వేయాలి

కడ్తాల్, మే5(ఆంధ్రజ్యోతి): రైతులు నేల స్వభావాన్ని, కాలాన్ని బట్టి అనువైన పంటలు సాగుచేయాలని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. కడ్తాల రైతు వేదికలో సోమవారం ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు-అన్నదాతలకు అవగాహన' కార్యక్రమంలో భాగంగా రైతు సదుస్సు నిర్వహించారు. ఏవో ఎ.శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగులో సాంకేతికాంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాలన్నారు. పరిశోధనల ఫలితాలను రైతులకు తెలియజెప్పి అందుకనుగుణంగా సాగుచేసేలా తోడ్పాటు అందిస్తేనే లక్ష్యం నెరవేరుతుందన్నారు. రైతులకు సాగులో మెలకువలను తెలియజెప్పేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. నీటి యాజమాన్యం, సస్యరక్షణ, విత్తన ఎంపిక, భూసార పరీక్షలు తదిరత అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంపీ చైర్‌పర్సన్ యాట గీత, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ వెంకటేశ్, వైస్ చైర్మన్ డి.సత్యం, శాస్త్రవేత్తలు విద్యాసాగర్, అహ్మద్ హుస్సేన్, మాధవి, ఇన్‌చార్జి ఏడీఏ అరుణకుమారి, సీఈవో దేవేందర్, మాడ్గుల ప్యాక్స్ చైర్మన్ తిరుమలరెడ్డి, నాయకులు వెంకటేశ్, వీరయ్య, నరేశ్, వెంకటయ్య, శ్రీపాల్, బిచ్య, ప్రభాకర్‌రెడ్డి, బోసు రవి, జంగారెడ్డి, శంకర్, రాజేశ్, రామకృష్ణ, రమేశ్, లాయక్‌అలీ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

రైతుల ముంగిట్లోకి శాస్త్రవేత్తలు

తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సి.సుధారాణి



ఫేస్ టు ఫేస్

తాండూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆరు అంశాల ప్రతిపాదికన 'రైతుల ముంగిట్లో శాస్త్రవేత్త' పేరుతో రైతుల వద్దకు వెళ్తున్నట్లు తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ సి.సుధారాణి వెల్లడించారు. ఆమె సోమవారం తాండూరులో ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు.

ప్రశ్న: కార్యక్రమ ప్రధాన ఉద్దేశం?

జ: ఈఏడాది వానాకాలం పంటలకు ముందస్తుగా రైతులను సన్నద్ధం చేయడానికి ఈ కార్యక్రమాలు చేపడుతున్నాం. రైతులు హాజరై శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

ప్రశ్న: ఎన్ని రోజులు నిర్వహిస్తున్నారు?

జవాబు: దాదాపు 40 రోజులు ఉంటుంది, మే 5 నుంచి జూన్ 13వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తాం. గ్రామాల్లో రైతువేదిక క్లస్టర్‌ల వేదికగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శాస్త్రవేత్తలు పర్యటిస్తారు.

ప్రశ్న: ఆరు అంశాలేమిటి?

జ: యూరియా వాడకం తగ్గించడం. రసాయన ఎరువులు వాడకుండా ఉండటం, నీటియజమాన్య పద్ధతులు పాటిండం. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయానికి సంబంధించిన ఏ కొనుగోలు చేసినా రశీదు పొందడం. పంట మార్పిడి చేసుకోవడం. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తాం.

ప్రశ్న : ఇందులో ఎవరెవరు పాల్గొంటారు?

జ: తాండూరు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు ప్రధానంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. వీరితో పాటు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని చేపట్టాం.

మాజీ మంత్రికి శుభాకాంక్షల వెల్లువ



సబితా ఇంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోపాల్

వికారాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని బీఆర్‌ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, నాయకులు అనంత్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అనిల్, మధుతో పాటు పలువురు నాయకులు పెద్దఎత్తున నియోజకవర్గం నుంచి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

కృష్ణయ్యను కలిసిన బీసీ సంఘం నేతలు



నవాబుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): దాదాపూర్ గ్రామానికి చెందిన బీసీ సంఘం మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ సోమవారం హైదరాబాద్ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను కలిశారు. బీసీ సంఘం నాయకులతో కలిసి ఆర్.కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

బ్యాంకర్లు సహకరించాలి



బ్యాంకర్లతో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య

పరిగి,మే 5 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం కింద నిరుద్యోగులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు సహకరించాలని పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య కోరారు. రాజీవ్ యువ వికాసంపై సోమవారం బ్యాంకర్లతో సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిగి మునిసిపాలిటి పరిధిలో 789 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తులపై విచారణ జరిపించి అర్హులైన వారిని ఎంపిక చేస్తామని తెలిపారు. తాము ఎంపిక చేసిన వారందరికీ బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలని కోరారు.

జస్టిస్ గిరిజ ప్రియదర్శినికి ఘన నివాళి



కోర్టులో సంతాపం తెలుపుతున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

వికారాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ యం.గిరిజ ప్రియదర్శిని అకాల మృతికి వికారాబాద్ జిల్లా కోర్ట్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు, న్యాయవాదులు రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమెకు నివాళులర్పించారు. జస్టిస్ గిరిజ ప్రియదర్శిని గతంలో వికారాబాద్ జిల్లా కోర్టులో పోర్ట్ పోలియోగా సేవలందించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. ఆమె చేసిన సేవలు చిరస్మణీయమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శాంతిలత, బస్వరాజ్ పటేల్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

బషీరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు సెల్ ఫోన్లు పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు బషీరాబాద్ పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ ఉపయోగించి పోయిన ఐదు ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్ఐ పి.శంకర్ తెలిపారు. సోమవారం బాధితులకు సెల్‌ఫోన్లను అప్పగించారు.

కొను గోల్‌మాల్!

(ఐదో పేజీ తరువాయి)

చేపల మార్కెట్లలోనూ తూకాల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. కిలో కూరగాయలు కొనుగోలు చేయాలనుకుంటే 500 గ్రాముల బాటుతో పాటు 500 గ్రాముల కూరగాయలను ఒక వైపు ఉంచి తూకం వేస్తున్న పరిస్థితి. మాంసం, చేపల దుకాణాల్లోనూ ఇదే పరిస్థితి. తూనికబాట్ల స్థానంలో రాళ్లు, చిన్నపాటి బండలను త్రాసులో వేసి తూకం వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా తూనిక బాట్లు, కొలతలపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కొరవడింది.

నాసిరకమైన ముడి సరుకులతో..

మూడుగంటల పాటు సినిమా చూసేందుకు వెళ్లిన వారికి టిక్కెట్టు కన్నా చిరుతిళ్ల ధరలు దడ పుట్టిస్తున్నాయి. సాధారణంగా దుకాణాల్లో రూ.10కే లభించే చిప్స్, పాప్‌కార్న్ ప్యాకెట్లను రూ.60 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. కూల్ డ్రింక్స్ మీద కూడా అదనంగా రూ.20 వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి చిన్న ప్యాకెట్‌పై వాటి నాణ్యత, బరువు, ధర, తయారు చేసిన చిరునామా కచ్చితంగా ఉండాలి. కాని ఇవేవీ లేకుండానే నాసిరకమైన ముడి సరుకులతో చిరుతిళ్లు తయారు చేసి సినిమా హాళ్లల్లో ఇష్టారీతిన విక్రయిస్తునారు. ఈ చిరుతిళ్ల ప్యాకెట్ల నుంచి దుర్వాసన వెదజల్లుతున్నా వాటినే విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ప్యాకెట్ల విక్రయాలపై ఏనాడు సంబంధిత అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవు.

తరుచుగా తనిఖీలు చేపట్టాలి

పెట్రోల్ బంకులు, స్వీటు దుకాణాల్లో తరుచూగా తనిఖీలు చేపట్టాలి. ఎలక్ట్రానిక్ యంత్రాల్లో చిప్‌లు అమర్చి మరి మోసాలకు పాల్పడుతున్నారు. వినియోగదారులను మోసం చేయకుండ అధికారులు చర్యలు తీసుకోవాలి. నెలలో రెండుమూడు సార్లు తనిఖీలు చేస్తే మోసాలకు పాల్పడకుండ ఉంటారు.

-మాటూరి రవికుమార్, కొర్రెముల

ఘొల్లుమంటున్న 'గొల్లచెరువు'!

(ఐదో పేజీ తరువాయి)



అక్రమ నిర్మాణాల వద్ద బీజేపీ నేతల నిరసన (ఫైల్)

గుర్రైందంటే అతిశయోక్తి కాదు. కొందరు అక్రమంగా పట్టాలు తెచ్చుకొని ఇళ్ల నిర్మాణాలకు తెరలేపారు. పేదలతో పాటు అగ్రవర్ణాల వారు సైతం అక్కడి స్థలాన్ని దర్జాగా కబ్జా చేశారు. తాజాగా కొంతమంది పిల్లర్లు వేసి మరీ దర్జాగా భారీ నిర్మాణాలను చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా నీటి పారుదలశాఖ అధికారులు, మున్సిపల్ శాఖ అధికారులు కనీసం పట్టించుకోని దుస్థితి. గొల్ల చెరువు స్థలం కబ్జాకు గురవుతుందని, పసారం బసప్ప భగీచా వెనుక భాగంలో చెరువు అలుగు పక్కన సిమెంట్ పిల్లర్‌లతో ఇల్లు నిర్మిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకొని చెరువును కాపాడాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు తాండూరు సబ్ కలెక్టర్, తహసీల్దార్, నీటి పారుదల, ఆయ కట్టు అభివృద్ధి శాఖ అధికారులు, మున్సిపల్ శాఖలకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల ఫిర్యాదు చేశారు.

వెంటనే చర్యలు చేపట్టాలి



చెరువు భూములు అన్యాంక్రాంతం కాకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి. మత్స్యకారులు రోడ్డున పడ్డకుండా చూడాలి. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వరకు హద్దు రాళ్లను ఏర్పాటు చేయాలి. కబ్జా చేసిన స్థలాలను మళ్లీ అమ్ముకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని చెరువును కాపాడాలి. అలాగే చెరువులోని గుర్రపు డెక్కను తొలగించాలి.

- నాగారం మల్లేశం, బీజేపీ పట్టణాధ్యక్షుడు, తాండూరు

అక్రమ నిర్మాణాలను ఆపాలి

వారం రోజులుగా సంబంధిత అధికారులకు చెరువు శిఖంలోని అక్రమ నిర్మాణాలను ఆపాలంటూ ఫిర్యాదు చేశాం. అయినా ఎవరు పట్టించుకోవడం లేదు. తాండూరులో ఉన్న ఒక్క చెరువు ఆక్రమణకు గురవుతోంది. చెరువుకు 100 మీటర్ల దూరం లోనే ప్రస్తుతం నిర్మాణాలను చేడపడుతున్నారు. ఇరిగేషన్, మున్సిపాలిటీ అధికారులు స్పందించి చెరువును కాపాడాలి.

- నరహరి, మత్స్య సహకార సంఘం, అధ్యక్షుడు, తాండూరు

మురుగు నీటిని మళ్లించాలి

● తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: గొల్ల చెరువు మురుగునీటిని మళ్లించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన నీటి పారుదల శాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. చిలుక వాగు, గొల్ల చెరువు అభివృద్ధి పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నాణ్యత పాటించేలా చూడాలన్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఇంకా అదనంగా నిధులు అవసరమైతే మంజూరు చేయిస్తానని చెప్పారు. మున్సిపల్ అధికారులు పనుల విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గొల్ల చెరువు మ్యాప్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం తాండూరు మున్సిపాలిటీ, తాండూరు మండలాలకు చెందిన 143 మంది లబ్ధిదారులకు రూ. 1,43,16,588 విలువ గల కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడి పొందాలని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుదీర్‌రెడ్డి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారంలో సోమవారం రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు ఎన్నో సేవలు అందిస్తుందని గుర్తుచేశారు. అనంతరం రైతు ముగింట్లో శాస్త్రవేత్తల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ నరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ సురేష్, మండల వ్యవసాయ అధికారి ఎంఏ బాసిత్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెంకటరమణారెడ్డి, ఎఈవో మంజుల, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నత్రజని అవసరాన్ని బట్టి వాడాలి

శామీర్‌పేట: వ్యవసాయ పంటల సాగులో రైతులు నత్రజని ఎరువులను అవసరాన్ని బట్టి వినియోగించాలని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ సవిత, డాక్టర్ విజయ లక్ష్మి రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని మజీద్‌పూర్‌లోని రైతువేదిక, బొమ్మరాశిపేటలోని పంచాయతీ కార్యాలయంలో సోమవారం మండల వ్యవసాయాధికారి రమేశ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతుల కోసం వినూత్నంగా ప్రవేశపెట్టిన రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మజీద్‌పూర్‌లో రైతు వేదికలో మండల వ్యవసాయాధికారి రమేశ్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, మాజీ జడ్పీటీసీ అనిత పాల్గొన్నారు.

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని భోగారం గ్రామంలో రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు రైతు ముగింట్లోకి వచ్చి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వెంకట్‌రాంరెడ్డి, శాస్త్రవేత్తలు శ్రీదేవి, సందిప్, విక్రమ్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

మోమిన్‌పేట్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్కతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-2002 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. అప్పట్లో విద్యాబుద్దులు నేర్పించిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అక్బర్, నారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గీతాబాయి, శంకర్, ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, దర్శన్, జనార్ధన్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు వెంకట్ పాల్గొన్నారు.



మోమిన్‌పేట్: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



పరిగి: శిశుమందిర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పరిగి: పరిగిలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో 2002-2003 పదోతరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జరుపుకున్నారు. వారి గురువులకు ఘనంగా సన్మానించారు. పాఠశాల సమితి కోశాధికారి వెంకట్‌రాంలు, ప్రధానాచార్యులు కె.మల్లేశ్, గురువులు రత్నాకరం, నర్సింహులు, ఈశ్వర్, లలిత పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు బిల్లు నిలిపివేయాలి

ధారూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ధారూరు పోలీసుస్టేషన్ ఆవరణలో 2017-2018లో నిర్మించిన సిమెంట్ రోడ్డును దాతల సాయంతో నిర్మించారని, ఈ రోడ్డుపై ప్రభుత్వ నిధులను మంజూరు చేయకుండా నిలిపివేయాలని ధారూరుకు చెందిన ఎస్‌కే. హాషీమ్ సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్ఐ అప్పటి ఎస్ఐ సంతోష్, సీఐలు కలిసి దాతల దగ్గర ఇసుక, మొర్రం, జేసీబీలను, నీటి ట్యాంకర్లను దాతల ద్వారా సేకరించి పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిమెంట్ రోడ్డు నిర్మించారని తెలిపారు. సీజ్ చేసిన ఇసుక, కంకర కూడ రోడ్డు నిర్మాణానికి వాడుకున్నారని చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణంపై ప్రభుత్వం నుంచి రూ.22లక్షలు ప్రభుత్వం ద్వారా అక్రమంగా బిల్లులు డ్రా చేసుకోవటానికి ఇద్దరు నాయకులు ఇంజనీరింగ్ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆయన తెలిపారు. విచారణ జరిపి సదరు సీఐ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.

నేడు రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

నవాబుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి కల్పించేందుకు అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంగళవారం (నేడు) ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అనురాధ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఎల్లకొండలో నిర్వహించే ఇంటర్వ్యూలకు మండలంలోని కెనరా బ్యాంకు పరిధిలో గల యువతీ, యువకులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షిప్తంగా..

కేజీబీవీలో అడ్మిషన్లు ప్రారంభం

దోమ: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి నూతనంగా 6వ తరగతి, ఇంటర్‌లో సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో వెంకట్, ప్రిన్సిపాల్ చైతన్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ గ్రూపులో 40 సీట్లు, యంపీహెచ్‌డబ్ల్యూలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఆధార్ కార్డు జిరాక్స్, రెండు ఫోటోలు, పదో తరగతి మెమో, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో పాఠశాలలో సంప్రదించాలన్నారు.

యువవికాసానికి సిబిల్‌స్కోర్ తప్పనిసరి

కోట్‌పల్లి: యువ వికాసానికి సిబిల్ స్కోర్ తప్పనిసరి అని ఎంపీడీవో డానియల్ తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యక్రమంలో సోమవారం యూనియన్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌లతో సమావేశం నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకం

దోమ: దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని బీసీ సంఘం దోమ మండల అధ్యక్షుడు గోవర్ధన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

క్షయ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

కులకచర్ల: క్షయ వ్యాధితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. కులకచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పది మందికి క్షయవ్యాధి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

విజయ్‌దేవరకొండపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కులకచర్ల: సినీ నటుడు విజయ్ దేవరకొండపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. గత నెల 26న జరిగిన ఓ సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు గిరిజనుల మనోభావాలను తీవ్రంగా దెబ్బ తీసే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్రైం కార్నర్

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

పెద్దేముల్, మే 5(ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పెద్దేముల్ మండల కేంద్రంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బుర్లపురి రవి(41) స్థానికంగా ఉండే బాలేసాబ్ వద్ద పశువుల కాపరిగా పనిచేసేవాడు. సోమవారం పశువులను పెద్దచెరువువైపు మేతకు తోలుకుపోతున్నాడు. అదేసమయంలో అటుగా వచ్చిన టిప్పర్ అతివేగంగా వచ్చి రవిని ఢీకొట్టింది. అతడి రెండు కాళ్ళపై నుంచి వెళ్లడంతో రవికి తీవ్రగాయాలు కావడంతో పరిస్థితి విషయమంగా మారింది. కుటుంబ సభ్యులు తాండూరు జిల్లాసుపత్రికి తరలించగా వైద్యులు అతడిని పరిశీలించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెపారు.

పాముకాటుతో బాలుడు..



శివకుమార్(ఫైల్)

దోమ, మే 5 (ఆంధ్రజ్యోతి): పాము కాటుతో ఓ బాలుడు మృతి చెందిన ఘటన దోమ మండలంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని బాసుపల్లి గ్రామానికి చెందిన చాకలి రాములు, సువర్ణక ముగ్గురు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. అందులో చిన్నవాడు చాకలి శివకుమార్(11) పరిగి పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో 6వ తరగతి పూర్తి చేసి ఇటీవలే వేసవి సెలవులపై ఇంటికి వచ్చాడు. తన తాత చాకలి పెద్ద నర్సయ్యతో సోమవారం ఉదయం పొలానికి వెళ్లాడు. ఈక్రమంలో పొలంలో ఉన్న మామిడి చెట్టుకు మామిడి కాయలు తెంపేందుకు వెళ్లగా అక్కడే ఉన్న నాగుపాము తన కాలుపై మూడు సార్లు కాటు వేసింది. గమనించి కుటుంబ సభ్యులకు తెలపగా కుటుంబసభ్యులు దొంగ ఎన్కెపల్లిలో మంత్రతంత్రాలకు బాగవుతుందని తీసుకెళ్లారు. అక్కడ బాలుడి పరిస్థితి విషమించడంతో వెంటనే పరిగి ఆస్పత్రికి తరలించారు. కానీ బాలుడు అప్పటికే మృతిచెందాడు. ఉన్న ఒక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మూడుచింతలపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శామీర్‌పేట్‌కు చెందిన దేవేందర్(19) సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం తనకు పనిఉందని ఇంట్లో చెప్పి బైక్‌పై బయటకువెళ్లాడు. తల్లి లావణ్య డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చి తలుపుతట్టగా ఎంతకీ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి తన అల్లుడు సాయంతో డోర్ తెరిచిచూడగా దేవేందర్ సీలింగ్‌ఫ్యాన్ రాడ్‌కు చీరతో ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. వెంటనే కిందకి దింపి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు షిర్డీసాయి సన్నిధిలో జిల్లా కళాకారుల ప్రదర్శన



డ్యాన్స్ మాస్టర్ అశోక్‌తో కళాకారులు

తాండూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మహరాష్ట్రలోని అహ్మద్ నగర్ జిల్లాలో ఉన్న ప్రముఖ షిర్డీ సాయిబాబా మందిరంలో జిల్లా కళాకారులు ప్రదర్శన ఇచ్చేందుకు తరలివెళ్లారు. సాయిబాబా మందిరంలో మంగళవారం (నేడు) సాయంత్రం 6గంటలకు షిర్డీ సాయి సంస్థాన్, కీర్తి ఆర్ట్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో కళావేదిక ద్వారా సాయినాథుడికి నృత్య హారతిని కళాకారులు ప్రదర్శించనున్నారు. జిల్లా కళాకారులు జానపద భక్తి నృత్యాన్ని డ్యాన్స్ మాస్టర్ అశోక్ ఆధ్వర్యంలో కళాకారులు స్పందన, కృష్ణవేణి, సాన్వి, ప్రణవి, కౌముది, లక్ష్మి, మహతిలు పాల్గొంటారు.


ఇంటర్మీడియట్ టాపర్లకు సన్మానం



టాపర్లకు నగదు పురస్కారం అందజేస్తున్న రవి

మూడుచింతలపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన శ్రీబాలాజీ వేంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థినులను మూడుచింతలపల్లి మాజీ సర్పంచ్ జాము రవి సన్మానించి అభినందించారు. కళాశాల యజమాన్యం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి సోమవారం మూడుచింతలపల్లి మాజీ సర్పంచ్ జాము రవి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు నగదు పురస్కారంతో పాటు షీల్డ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మధుసూదర్‌రెడ్డి, బోర్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు అందించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

దోమ, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ బిల్లులను వెంటనే అందించాలని సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో గ్యామాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్య, రఘురాం మాట్లాడుతూ మండలంలోని దిర్సంపల్లి, తిమ్మాయిపల్లి, బ్రహ్మణపల్లి, రాకొండ తదితర గ్రామాల్లో గత రెండు నెలలుగా పని చేస్తున్న ఉపాధి కూలీలకు డబ్బులు అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా రోజు కూలీ రూ.600 అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

కొడంగల్, మే 5 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి దోస్త్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఏ (తెలుగు, ఇంగ్లీష్ మీడియం), బీఎస్సీ లైఫ్ సైన్సెస్ (తెలుగు, ఇంగ్లీస్ మీడియం, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ (తెలుగు, ఇంగ్లీష్), బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఇంగ్లీష్ మీడియం) కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాల దోస్త్ కోడ్ 3016 అని తెలిపారు.వివరాలకు 8008391979 సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.